ఎదురువచ్చిన మృత్యువు

జీవనప్రభాత

ముందుగా చెప్పిరాదు. తన రాక తనకే తెలియనట్లు నటిస్తుంది. ఏదో వేళాపాళా తెలియని సమయాన, యథాలాభంగా షికారు తిరుగుతూ తిరుగుతూ వుంటే, చటుక్కున ఏదో స్ఫురణకు రాగా, రవంతసేపు వేచివుండి...ఏదో అనుకుని ఏమో చేయబోయినట్లు......ఎక్కడో మరి యే యింటిమీదనో చక్కగా నిక్కచ్చిగా వాలి కూర్చుంటుంది!—

ఆమె చల్లని బరువైన శరీరం ఆ యిల్లంతా క్షణంలో వ్యాపిస్తుంది. ఆమె ఉనికిని అనేక కంఠాలు ఏకస్థాయిలో పదే పదే ఘోషిస్తాయి.

మనకు అతి సన్నిహితమైనదీ...అతి దూరమైనదీ—

మనిషికి అత్యవసరమైనదీ, కోరుకున్నప్పుడు లభ్యం కానిదీ...

ఆమె....మృత్యువు !

* * * *

ఆరోజు ప్రభలవారి కొంపలోంచి ఒకే ఒక్క కంఠం గొల్లుమంది. వచ్చిన నలుగురికీ వార్తల నందిస్తూ ఇతోధికంగా సహాయపడుతోంది—పనిమనిషి అప్పలమ్మ, కళ్ళనీళ్ళతో పమిట చెంగు తడుపుకుంటూ.

ప్రభల విశ్వనాథశాస్త్రి బ్రతికివుండగా ఏమిటో చనిపోయిన తర్వాత కూడా అంతే అనిపిస్తున్నాడు ఆ వూరి కంతా.

అతన్ని అంతా ఎరుగుదురు — కొంచెమో గొప్పో. అయితే, అతని అంతస్సు మాత్రం యెవరూ యెరగరు ... తనొక్కతె మాత్రమే యెరుగుదునని గట్టిగా చాటిరాగాలమధ్యనే చెపుతోంది—సూరమ్మ అని పిలవబడే సూర్యకాంతమ్మ.

“రోజూమాదిరే నిన్నా మామూలుపనులన్నీ, చేసుకున్నాడు...రాత్రి యథాప్రకారం భోంచేసి గొడ్లనీ గోదనీ చూసుకోడాని కెళ్ళేడు...తర్వాత ఊరంతా తిరిగి కాస్సేపు చదువుకుని పడుకున్నాడు...”

“అవును—యెంతసేపు గుక్కెడు ప్రాణం...” శవం ప్రక్కనే చదికిలపడుతూ అంది ప్రక్కయింటి ముసలమ్మ.

శాస్త్రి మృతివిధానం కొంత ఆశ్చర్యాన్నే కలిగించింది—

రోజూకంటె ఒకగంట ముందుగానే, అంటే మూడుగంటలకే, తెల్లవారగట్ల లేచి గోదావరీస్నానం పూర్తిచేసుకునివచ్చాడుట. సూరమ్మ లేచేసరికి నారింజ చెట్టుకింద పద్మాసనం వేసుకుని జపం చేసుకుంటూ కనపడ్డాడు.

మళ్ళీ కొంతసేపటికి ఆమె అటువేపు వెళ్ళేసరికి దర్భాసనంమీద వెల్లకిలా పడుకుని నిద్రపోతున్నాడుట—

“లేనిపోని యీతిబాధలన్నీ యీమధ్య పెట్టుకుని వొళ్ళు నాశనం చేసుకున్నాడు—నిస్త్రాణొచ్చిందో యేమో—” అనుకుని సూరమ్మ తనపనులు గబగబా ముగించుకోసాగింది.

అప్పటికి అప్పలమ్మ వీధిపాచి చేసి పెరట్లోకి వచ్చింది. సూరమ్మ కుంపటి రాజేస్తోంది-ఆయన లేచేసరికి ఇంత కాఫీ కాచి యివ్వడానికి....

సూరమ్మ ఏడుపుల మధ్యనే బయలుపడుతున్న కథకి అప్పలమ్మ మధ్య మధ్య కొంత గ్రంథం అతికిస్తూ వస్తోంది.

అప్పలమ్మ పెరడు వూడుస్తోంది — ఆమూల నుంచి ఈమూలకి. అప్పటికప్పుడే చప్పగా తెల్లవారిపోయింది. ఒకటి రెండుసార్లు యథాలాభంగా శాస్త్రిగారికేసి చూసింది. జపం చేసుకునే ఆయన వేపు పాచి చీపురుతో వెళ్ళడం ఆమెకు అనుమాయితీ కాదు. ఆయన తిడతాడని కాదు, పల్లెత్తుమాట అని యెరుగడు. ఇప్పుడే కాదు. ఎప్పుడూ!

సూరమ్మపిన్నిగారు యింకా యింకా ఏవో చాదస్తంపనులు చేసుకుని, సూర్య నమస్కారాలు చేస్తోంది.

నీరెండ నారింజచెట్టుమీద పడుతోంది. యెంతకీ కదలకుండా ఆకాశంకేసి చూస్తూ పడుకున్న శాస్త్రిని చూసి, అప్పలమ్మ మనసు పట్టలేక, చీపురు పారవేసి-మెల్లగా అటు వెళ్ళింది. తనకు తెలియకుండానే యేదో పిచ్చకేక వేసి చదికిలపడింది.

"అప్పటికే గంటసేపయి మారాజు పానాలు పోయుంటాయి!" అంది.

అయినా అనుమానం దిగాలుగా ఆయనకేసి చూస్తూనే వుండిపోయింది. కేక విని కంగారుగా తొట్రుపడుతూ వచ్చిన సూరమ్మ ఆ దృశ్యం చూస్తూనే గొల్లుమంది.

ఒక మునీశ్వరుడిలాగ జపం చేసుకుంటూ యోగ సమాధిలోనే వుండి పరమేశ్వరుడిని చేరేశెంటున్నారు, ప్రేక్షకులు.

ఏమైతేనేమి, అర్థం బద్ధం లేకుండా అధార్తుగా చనిపోయిన శాస్త్రిగారి వాకిలి దగ్గరే గ్రామం అంతా నిలబడిపోయినా, ఇద్దరు ముగ్గురు పెద్దలు గ్రామ చావడి దగ్గర కూర్చుని పరిస్థితులు సమీక్షిస్తున్నారు. సిసలైన వార్తలు అక్కడికే చేరుతాయి. మళ్ళీ అక్కడనుంచే నలుదిక్కులకీ బయలుదేరుతాయి.

ఆ క్రితం రాత్రి గ్రామం అన్ని వీధులూ శాస్త్రి తిరగ సాగేడు. యధాలాభంగానే అనిపించినా ఏదో ప్రత్యేకమైన ఆప్యాయతతో మాత్రం తిరిగేడు. ఎరిగినవాళ్ళనీ యెరగనివాళ్ళనీ, చివరకి కంటికి కనపడిన కుర్రకుంకలను కూడా పలకరించాడు. కుశలప్రశ్నలు వేశాడు. "మరి సెలవు తీసుకుంటా" అంటూ వచ్చాడు!

ఇన్ని సంవత్సరాలలోనూ యెప్పుడూ యెవరినీ తానై పలకరించి యెరగడు. ఎవరేనా మాట్లాడించినా ముక్తసరిగా మాట తుంచినట్లు మాట్లాడేవాడు. అందుచేత ఆ యెదురయినవాళ్లు కొంత విస్తుపోయారుట కూడా—

"పాపం! ఆవిధంగా అందరిదగ్గిరా సెలవు తీసేసుకున్నాడు..." అన్నాడు ముక్కు పొడుం పీలుస్తూ ... ఆరోజు ఇంటింటికీ తిరగడం మానివేసిన యాయవారపు బ్రాహ్మడు.

అంతేకాదుట—

ఆ క్రితం రాత్రి గ్రామచావడిదగ్గిర కూర్చుని ప్రపంచరాజకీయాలను తారుమారుచేస్తూ నలుగురిచేతా బలవంతాన నెమరువేయింపిస్తున్న మునసబు కరణాల మధ్య శాస్త్రి పదినిమిషాలు గడిపేడు. ... అలవాటు లేని లోకాభిరామాయణం మాట్లాడేడు. ఎవ్వరూ ఎన్నడూ యెరగని అతని నవ్వు నాలుగైదుసార్లు విన్నారు గ్రామప్రముఖులు!

"యెల్లుండి మా కోడెదూడనీ మా రైతు పోలయ్యకిచ్చేశాను. గేదెని మా దాసీది అప్పి— పిల్లలు గలది— దాన్ని తీసుకోమన్నాను ... ఇందాకనే వాళ్ళని పసువుల్ని తోలుకెళ్ళమన్నాను ..."

కరణం వెటకారంగానో కొంటెగానో అతనివేపు చూశాడు — తగలవేస్తున్న లంకాకుచుట్టను నోట్లోంచి తియ్యకుండా:

"యేం....యింత దాతృత్వం ... ?" అన్నాడు పైకి నీరసంగా...'యెప్పుడూ లేనిది' అని మనస్సులో గట్టిగానే అనుకున్నాడు, సమాధానంగా పళ్లు పటపట లాడించుకున్నాడు.

"ఊరిపెద్దలు కాబట్టి మనవిచేసుకుంటున్నాను, ...అమాయకులమీద...అనుకోకుండాఒక్కొక్కప్పుడు దొంగతనాలు మోపబడొచ్చు—"

"అటువంటివి జరక్కుండా చూడ్డానికి మీరు బతికేవున్నారుగా—" అన్నాడు మునసబు, వెటకారానికి మరింత కారం కలుపుతూ.

దూరంగాకూర్చుని మాటలన్నీ వింటున్న సారపరెడ్డి కత్తితో తాటికొమ్మని నరికినట్లు, "యింకో ఆవుండాలి కాబోలు?" అన్నాడు — అదిమాత్రం నీకెందుకోయ్ అన్నట్లు!

శాస్త్రి యధాలాభంగానే సమాధానం యిచ్చాడు: "దాని అవసరం వేరేవుంది!"

"కరణంగారి మాటకి సమాధానమే చెప్పినారు గాదు—" అని మందలించారు ఆయుర్వేద మార్తాండ అయ్యవార్లం అయ్యగారు.

"వ్యవసాయం మరి మూడుసంవత్సరాల వరకూ మా పోలడే మక్తాకుచేస్తాడు," అంటూ శాస్త్రి లేచి నిలుచున్నాడు ఇతర విషయాలు తనకు కానట్లు.

ఊరుకో లేక పోయాడు మునసబు. తనూ నిలబడ్డాడు : "యేవండి శాస్త్రిగారూ సన్యసించేస్తున్నారా?... కాశీకి ప్రయాణం కట్టేరా?... యేమిటి ఈ హడావుడంతా ??"

"మనవూరుమీద కోపం వొచ్చిందేమో!" అని గొణుగుతున్నాడు కరణం, తనప్రశ్నని మళ్ళీ మళ్ళీ చూపులతో నే పృచ్ఛిస్తూ—

శాస్త్రి రెండడుగులు వేశాడు. నారప రెడ్డికూడా లేచి అయ్యవార్లంగారితో అన్నాడు : శాస్త్రి తరఫున : "తంటసాలన్నీ వొదిలించుకుంటున్నాడు లెండీ"—

పేరుపేరునా సెలవుతీసుకుని శాస్త్రి వెళ్ళిపోయిన దిక్కు చూస్తూ అయ్యవార్లంగారు మిగిలిన వారితో అన్నారు :

"నా అనేవారెవరూ లేరు...యెవరికోసమనో సుఖం అనేది లేకుండా ఈమనిషి నాలుగు చేతులా ఆర్జించాడు...సుఖపడేయోగ్యతుండొద్దూ?"

ఈ ఉదయం, ఇదే అయ్యవార్లంగారు ఇదే చావడిదగ్గిర నలుగురితోటే అంటున్నారు: "అవు అవసరం వేరే వుంది—అని ఆ మనిషి అన్నప్పుడే నాకు అనుమానం వేసింది. తన చితి తనే పేర్చుకుంటున్నాడేమిరా అని!"

ఇటు ప్రభలవారి కొంపలో గుండెలు పగల కొట్టుకుంటూ యేడుస్తున్న వితంతువు, శాస్త్రి కంటె రెండు మూడేళ్లు చిన్నదీ అయిన ఈ సూరమ్మ ఎవరు?

అతనికి తోబుట్టువా? వంటలక్కా? కాదు... కాదు...

అతని సన్యాసి సంసారానికి లోగడ అప్రయత్నంగా దొరికిన ఒక ఆడ దిక్కు!

రెండేళ్ళక్రితంవరకూ ఈమెని ఆవూరివారెరగరు. ఎక్కడనుంచో ఆకాశంమీదనుంచన్నట్లు ఊడపడి ఒక రోజు శాస్త్రి వాకిట్లో కూలబడింది. ఆనాటినుంచీ ఆ యింటికి ఆమె ఒక కావలి కుక్క అయి కూర్చుంది.

బంధుత్వం విషయం శాస్త్రిని ఎవరూ అడగలేరు. అడగలేరు, అడగరు. సంభాషణ పెంచే మనిషిని చూస్తే అతను తప్పించుకుని వెళ్లిపోయేవాడు. రకరకాల ప్రస్తావనలమీదట సూరమ్మే ఆ విషయం చెప్పకునేది ఇరుగు పొరుగుల ఆడవాళ్ళ మధ్య.

శాస్త్రికి ఈ సూరమ్మ అనే మారపు బంధువు మినహాగా ఇంకెవరూ లేరా?

"ఆయన కెవరూ లేర్నాయనా ... అన్ని దిక్కులూ పోయి గొల్లుమంటున్న నన్ను చేరదీశాడు. ఈ దిక్కు కూడా నాకు లేకుండా చేశాడు దేవుడు. ఒక్కమాటేనా చెప్పకుండా చచ్చిపోయాడు మా చినబాబు..."

* * *

రెండు నెలలక్రితమే శాస్త్రిలో ఒక విపరీతమైన మార్పు కనిపెట్టింది సూరమ్మ. మనిషి కొంచెం నీరసపడిపోతున్నట్లు కనిపించసాగేడు. అంతే కాదు— పూర్వం యెప్పుడూ కనిపించని విసుగూ, చిరాకూ అతనిలో ముఖ్యంగా కనిపించసాగేయి.

అప్పట్లో నే అనుకుంటాను-శాస్త్రి ఏదో వూరు వెళ్ళి సాయంత్రానికే తిరిగిరాక మూడు నాలుగు రోజులకు వచ్చాడు. మనిషి ఎందుచేతనో డీలాపడిపోయాడు. ఒక రోజున అనవసరంగా రైతు పోలయ్యమీద మండిపడ్డాడు. తర్వాత తన దురుసుతనానికి తనే చాలా బాధపడ్డాడని సూరమ్మ అంటుంది.

అప్పటినుంచే కాబోలు ఎప్పుడూ లేని చదువులు ప్రారంభించాడు రాత్రిళ్లు. గంటల తరబడి కళ్లు చిల్లులు చేసుకుంటూ లాంతరుదగ్గిర కూర్చునేవాడు. ఏవేవో వ్రాసుకునేవాడు.

నెలరోజుల క్రితం మళ్ళీ ఊరెళ్ళి నాలుగు రోజులలో తిరిగి వచ్చాడు. ఈమాటు మనిషి రవంత స్థిమితపడ్డాడు. కాని అలవాటులేని రాత్రిళ్ల చదువులు మరీ యెక్కువయ్యాయి.

అటువంటి సమయాలలో-నడవలో నేల మీద చెంగుపరుచుకొని పడుకుని వున్న సూరమ్మమనస్సు ఉసూరుమనేది. నాలుగైదు సార్లు నోరు కూడా చేసుకుంది.

"ఒళ్లు పాడుజేసుకుంటూ యెందుకు బాబూ ఈ తాపత్రయం?" అని.

అతను వినిపించుకునేవాడు కాదు.

కాని-ఆ మాటలు అన్న తర్వాత అతను ఏదో పరధ్యానంలోకి చూస్తూ ఊరుకోవడం ఆమె గమనించింది. ఒక వేళ అతని మనస్సుకి కష్టం కలుగుతుందేమోనని మరి అనడం మానివేసింది.

ఈమధ్య రెండు వారాలనుంచీ రోజూ ఎక్కడికో వెళ్ళి వస్తూనే ఉన్నాడు. పొలం కూడా నాలుగైదు రోజులు వెళ్ళనే లేదుట. కాని, మనిషి బాగా తేరుకున్నట్లే కనపడసాగేడు. హుషారుగా, ఏదో పెద్ద బరువు గుండెలమీదనుంచి పోయినట్లుగా కనపడడమే కాకుండా జీవితంలో మొదటిసారి అన్నట్లు అతని ముఖాన చిరునవ్వు కూడా చూడసాగింది సూరమ్మ.

మూడు రోజుల క్రితం కాబోలు మళ్ళీ రాజమండ్రీ వెళ్ళి వచ్చాడు.

ఇదీ సూరమ్మ చెప్పగలిగిన యావత్తు కథా. ఎన్ని రకాలుగా డొంకతిరుగుడుగా ప్రశ్నలు వేసేది, ఇంతకు మించి రవంత కూడా కథను పెంచలేకపోయింది సూరమ్మ. అది కొంత కారణమయ్యింది, కరణం గారి నిస్పృహకు.

వీధిలో అరుగుమీద ముని కాళ్ళ మీద కూర్చున్న కరణంగారికొచ్చింది తలనొప్పి. చుట్ట కాలుస్తూ జనాన్ని తదేకదీక్షగా పరికిస్తున్న మునసబుకేసి ఈర్ష్యతో చూడసాగేడు కరణం. ఆలోచనా సలహా ఎప్పుడూ మునసబు ఇవ్వలేడు. ఇప్పుడు మాత్రం ఎక్కడనుంచి తెస్తాడు? ఆ లేని వస్తువును!

ఆ మునసబుకు ఈ గొడవేమీ పట్టినట్లే లేదు. తను పట్టపగలు శవజాగరణం చేస్తున్నానన్న విషయమే మరచిపోయాడు.

ఈ మధ్య వ్యవసాయపు పనులేమీ లేనందువల్లా నాలుగు నెలలకు పూర్వమే పంచాయతీబోర్డు ఎలెక్షనులు పూర్తికావడంవలనా ప్రజలకందరికీ రెండు చేతులా తీరుబడి ఉండిపోయింది.

వాళ్లందర్నీ పలకరిస్తూ, ఈ సందర్భాన్ని కాస్తా వినియోగించుకుంటున్నాడు మునసబు. అటువంటి వీలు సాలులు దొరకబుచ్చుకోవడం చేతకానివాడు కరణం. వయస్సు ముదిరిపోవడం వలనా, ఇట్టే కలత బారే మనస్సు కావడం వలనా, మరీ అయోమయంలో పడిపోతున్నాడు కరణం.

ఒక వేళ యెవరేనా యేకారణం చేతేనా శాస్త్రిని చంపివేయలేదు కదా అని అతని అనుమానం.

నలుగురి వాకబుల వలనా ఈ సూరమ్మ మంచిదే అనీ ఎంతో నమ్మకస్తురాలనీ—అతి నెరిగున్న విషయమే అయినా రూఢిపడింది.

శాస్త్రి గుంగలాటి మనిషి. ఎప్పుడూ తలనెప్పి కూడా యెరగడని ప్రతీతి. నిన్నరాత్రే పదిమంది ఎదటా నవ్వుతూ మాట్లాడేడు; ఊరంతా ఊరేగి వచ్చాడు.

అటువంటివాడు అధార్తుగా చచ్చిపోతేనే గ్రామ పెద్దలకు వస్తుంది చిక్కు.

రేపు ఏ సుకూక్క మొగమూ యెరగనివాడో వారసుడుగా వచ్చి అడ్డదిడ్డమైన ప్రశ్నలూ వేసి తల మొత్తగలడు—ఏమాత్రం పొరబాటూ అశ్రద్ధా జరిగినా.

అయితే ఇప్పుడు శవపంచాయితీ శవపరీక్షా జరిగించాలా? శవాన్ని కొవ్వూరు గవర్నమెంటు డాక్టరుదగ్గిరికి పంపించాలా - లేక గోదావరి గట్టుకు పంపాలా?

“మనిషిగుండెకాయ వుంది చూడండి. అది దేవుడులాటిది. ఉన్నట్లే మనకి తెలియదు. ఒక మంచిరోజు చూసుకుని ‘నేనున్నానహోయ్ కాస్త జాగ్రత్తగా మసులుకోండి’ అని గోల ప్రారంభిస్తుంది. మన్నికాదనుకుంటాం. అది యెంతేనా ఆడుతుందినాటకం. అసలు ఆగిపోయేనాటివరకూ అసలటువంటి వస్తువే వున్నట్టు అంతవరకూ చాలామంది గ్రహించలేరు... అప్పుడింక లాభం లేదు!”

“యెంతటి బలంగల మనిషినీ ఇట్టే పీక నులిమేసి చంపేస్తుందిలెండి....ఆ మాట నిజం. యేమంటారా మా పెత్తండ్రి కొడుక్కి—”

అయ్యావార్లంగారు మునసబుతో నడిపిన సంభాషణలోని గుండెకాయిని పట్టుకుని కొంత ధైర్యంతో లేచి నిలుచున్నాడు కరణం.

సరి అతని చావునిగురించి ఏదో ఒక నిర్ణయానికి రాగలిగేడు. అతని ఇతరవ్యవహారాలెలాగ తేల్చాలీ అని—

ఒక యిల్లు, పది పన్నెండెకరాల సుక్షేత్రమైన మాగాణి, మామిడితోట, నారింజతోట, ఇంట్లో నిలవ వున్న బస్తాల ధాన్యం, మిరప బుట్టలు, అపరాలు... ఇవి కాక ఎక్కడో యే బ్యాంకులోనో వుండితీరాలని పుకారుగా వున్న చచ్చినంత రొక్కం నిలవ.

ఇదంతా ఏవిధంగా యెవరికి దఖలు పరచాలి ఇతని ఆస్తిపాస్తులన్నీ ఎంతకాలం కోర్టు లిటిగేషన్లలో వుండాలి? అవి తెమిలేలోగా తన కాళ్ళు ఎంతవరకూ అరిగిపోవాలి?

ఎందుకు వచ్చిందిరా ఈ దిక్కుమాలిన పంచాయితీ అని కరణంతో బాటు బోర్డు అధ్యక్షుడు నారప రెడ్డి కూడా బాధపడుతున్నాడు.

"ఏదో నూటికీ కోటికీ మన హయాంలో ఇలాంటివి జరక్కపోతే యెలాగయ్యా" అంటాడు మునసబు. అతని దంతా పిడివాదం. ఇటువంటి సంఘటనల వలన గాని ఊరి పేరు పేపర్లో పడదు.

శాస్త్రికి ఆ వూళ్ళో విరోధులుండడానికి వీలు లేదు. ఎవరేనా చిల్లర మల్లర అడిగిందే తడవుగా ఇచ్చి వేసేవాడు. అతని దగ్గరికి, వ్యాపారానికయ్యేది డబ్బు సర్దుబాటుకయ్యేది, రాజమండ్రీనుంచి ఇద్దరు ముగ్గురు వర్తకులు వచ్చిపోయేవారు. వాళ్లు మంచి పరపతులున్న వారే. ఎంత పిసినిగొట్టు మనిషని శాస్త్రి పేరు పొందినా, అతని పిసినారితనంవల్లా - పట్టుదల వలన బాధపడి ఇబ్బందులు పడిన వారుగాని, అతనిపట్టుదల వలన కష్టాలపాలయినవారుగాని, ఆ గ్రామంలో లేరు. ఆ చుట్టుపట్లా లేరు. ఎవరేనా దూరంగా వున్నారేమో యెవరూ యెరుగరు.

పట్టుదలా పిసినిగొట్టు తనం అతను సేద్యంలో చూపించేవాడు ముఖ్యంగా. తను రెక్కలు విరుచుకుని పని చేసేవాడు. ఎదుటివాడిచేత చేయించేవాడు. చెట్టుని వున్న ఒక్క కాయీ ఎవరినీ ముట్టుకోనిచ్చే వాడు కాదు.

గ్రామానికి సంబంధించిన వ్యవహారాలలో మాత్రం మొదటినుంచీ అతనిది ఒకటే పద్ధతి. పది మందీ కలిసి చేసిన నిర్ణయాన్ని తానూ ఒప్పుకునే వాడు; శషభిషలలో మాత్రం కలుగజేసుకునేవాడు కాదు.

సుమారు పుష్కరం క్రితం శాస్త్రి తల్లిదండ్రులు ఎక్కడనుంచో ఈ వూరు తర్లివచ్చారు. దరిమిలాని ఒకటి రెండు సంవత్సరాలకి శాస్త్రి దిగి వ్యవసాయం ప్రారంభించాడు. రెండెకరాల మాగాణి పొలంతో. అతని తండ్రి యెప్పుడూ వీధి వాకిలి చూడనేలేదు. ఆయన చివరి జీవితం అంతా ఒకే మంచంమీద గడచిపోయింది. శాస్త్రి తల్లిని మాత్రం ఆవూరివారు తరచు చూస్తూనే ఉండేవారు - గోదావరికీ ఇంటికీ మధ్యని - నీళ్ళ బిందెతో. ఒక పండు ముత్తైదువ ఒక పార్వతీదేవి వలె - మెల్లగా అడుగులలో అడుగులు వేసుకుంటూ వెళ్లేది!

అతను వచ్చిన మరి రెండు సంవత్సరాల లోపునే తల్లిదండ్రుల నిద్దర్నీ ఒకే మాసంలో అతను దహనం చేశాడు. యథావిధిగా కర్మ జరిపించాడు. అదివరకు తలమీద వుండే క్రాఫింగు తల్లి చనిపోయిననాడే మాయమయి మరి రాలేదు. అతని వేషం కూడా ఆనాటినుంచే మారిపోయింది. ఒక తుండుపంచ, బనీను - తుండుగుడ్డలలోకి.

ఒక విరాగివలె కనపడేవాడు. కాని, అతి పొదుపరి. నిత్య సంధ్యావందనాది కాలతో కర్మిష్ఠి అనే పేరు సంపాదించాడు. సూరమ్మను పూర్వం స్వయం పాకం మీదనే బ్రతికేవాడు.

మంచిబలిష్ఠుడూ, ఆజానుబాహువూ అయిన అతనికి గ్రామం వయస్సు నిర్ణయించలేకపోయింది. సూరమ్మ అంచనాప్రకారం యేభయి దగ్గర. కాని అతని శివం పది సంవత్సరాలు తక్కువే చెపుతుంది. అతనికంటే చిన్నదే అయిన సూరమ్మ షష్ఠి పూర్తి అయిన జీవిలాగ కనపడుతుంది.

తెల్లవారగట్ల ఏ నాలుగింటికో లేచిన శాస్త్రి పొలంలో కాయకష్టం చేసుకుంటూ, అపరాహ్నం తిరిగివవెనక భోజనం చేసుకుని, ఆతర్వాత ఎన్నడూ విశ్రాంతిని ఎరుగక, రాత్రి ఏ పదింటికో పడక చేరేవాడు.

ఒక విధంగా ఎన్నడూ నీతీ నియమం తప్పని ఈ మనిషి పదిమందికీ ఒక ప్రశ్నగానే, అర్థంకాని సమస్యగానే దనిపోయాడు. తన స్వంత దహన సంస్కారాలకు ఏమి యేర్పాటులు చేసుకున్నాడో గోచరం కావడంలేదు పెద్దలకు.

"ఆయనకి నేనూ నాకు ఆయనా మినహాయిస్తే వేరుదిక్కు లేదండి. యావత్తు కర్మ యథావిధిగా ముందు జరిపించండి స్వామీ —" అని కళ్ళనీళ్లు తుడుచుకుని అన్నది సూరమ్మ.

గతించినదానికి విచారించీ తల మొత్తుకునీ లాభంలేదని ఆమె గ్రహించేసరికి ఉదయం పదిగంటలు దాటింది.

ఆ వీధి స్త్రీలంతా పొయ్యిలలో నిప్పువెయ్యక శవం యెప్పుడు కదులుతుందా, యెప్పుడు రెండు మెతుకులు ఉడకవేసి పిల్లలకి పెట్టుకోడమా అని ఎదురుచూస్తున్నారు.

ఏది ఏమయినా అది తప్పదు కదా!

"ఆ మహానుభావుడి ధర్మమా అంటూ ఇంట్లో ఊరందరికీ సరిపడే సరుకుంది. ఏదో రొక్కం నిలవ వుంటుంది...కానియ్యండి బాబూ..."

అని ఆవిడ మరొక్కసారి ధైర్యం చెప్పిన తర్వాత కరణంగారి కాలుకదిలింది. రెండు మూడువందల లోగిళ్ల బ్రాహ్మణ్యంగల ఆగ్రామం, విశ్వనాథశాస్త్రి భౌతికదేహ దహనసంస్కారానికి గోదావరిగట్టుకు ప్రయాణం చేసింది.

ఇరుగు పొరుగుల స్త్రీలంతా ప్రభల వారింటికి మిగిలివున్న ఆకెళ్ల సూరమ్మనే మరీమరీ పరామర్శించి వెళ్ళిపోతున్నారు. ఏదో అన్నీ తనకు తెలుసునని చెపుతోందేగాని, నిజానికి విశ్వనాథశాస్త్రి హృదయంలో గుప్తంగా నిలచిపోయి దహనమైపోయిన సంగతులు ఆమెకేమి తెలుసు?

అతని భార్యాబిడ్డలు అసలుండేవారా? అతని అత్తవారెవరు? ఎక్కడ? అతని పూర్వచరిత్ర యేమిటి?

ఈ మధ్య ఎక్కడెక్కడికో తిరుగుతూ రకరకాలుగా పడిన తాపత్రయాలేమిటి? ఎందుకు పడ్డాడుట?

ఈ ప్రశ్నలకి ఆమె ఏమి సమాధానాలు చెప్ప గలదు—?

ఒక్క నమస్కారం తప్ప!

* * *

దహన సంస్కారం పూర్తయిన మరుక్షణంలో, ముందుముందు ఎందుకైనా మంచిదనే వుద్దేశ్యంతో, దినపత్రికలకు కరణంగారి సంతకాలతో ఒక ప్రకటన పంపబడింది.

మృతి వివరాలు ఇస్తూ - ఎవరైనా అతి సన్నిహితులు గాని ఆత్మీయులు గాని శాస్త్రిగారి ఆస్తిపాస్తులకి వారసులు కాతగ్గవారుంటే పూర్తి వివరాలతో వెంటనే తెలియచేస్తూ (యథావిధిగా కర్మ చేయడానికి) బయలుదేరి రావలసింది - అని ఆ ప్రకటన.

అనవసరమైన లిటిగేషను ముందుగానే పెరగకుండా వుండడానికిగాను ఇందులో ఆస్తి వివరాలు మాత్రం ఇవ్వబడలేదు. ఇది పంచాయతీ పెద్దలంతా ఏకగ్రీవంగా ఆమోదించి చేసిన పని.

"ఒక్కసారి మాటవరసకు కూడా చెప్పలేదు ఎక్కడ యెవరెవరున్నారో యేమిటో...ఇక్కడ తలదాచుకున్నందుకు మోయలేని బరువులన్నీ నా నెత్తినే వొదిలివెళ్లేడు కదా...అహోరాత్రులు కష్టించి సంపాదించిన ఆస్తి కాస్తా ముక్కలైపోతూంటే చూడవలసిన కర్మకూడా నాకు రాసివుంది కాబోలు..."

అని సూరమ్మ మనిషి మనిషిదగ్గరా వాపోవ సాగింది.

నిజమే మరి. దిక్కులేనిఆడది. అంతా పరాయి వాళ్లు. తానూ పరాయిదే. ఏమిచేస్తే ఏమంటారో ముందు ముందు.

ఆమెని హఠాత్తుగా నిండు సముద్రంలోనే ముంచి పారవేశాడు—అదికూడా వాస్తవమే!

వ్యవహారం వ్యవహారమే మరి. పద్ధతిప్రకారం నడుచుకోవలసిందే - ఎవరైనా. ఆ యింటగల సరకుల జాబితా, కంటికి కనపడే ఆస్తివివరం పంచాయతీ పెద్దలు తయారుచేశారు. ఇంట్లో కొంచెం తక్కువగా రెండువందల రూపాయల రొక్కం వుంది. బ్యాంకు పాసుబుక్కులు - చెక్కు బుక్కులు అన్నీవున్నాయి. అతని పెట్టెలు అన్నీ తాత్కాలికంగా సీళ్లు వేశారు. ఇంటెడు సరుకులూ సామానుతో సహా సూరమ్మకు తాత్కాలికంగా వప్పగించారు...

ఆ రోజుకూడ తెల్లవారేసరికి శాస్త్రి గుణగణాలు ఆనోటాఆనోటా రకరకాలుగా ప్రతిధ్వనించ సాగేయి. అతని మృత్యువు ఎంత వింతగా వుందో, ఆఖరివారపు అతని చరిత్రకంటే ఆఖరి రోజు అతని దినచర్య అందర్నీ విభ్రాంతుల్ని చేయసాగింది...

ఈ ఆఖరి వారం యావత్తూ వ్యవహారాలన్నీ చక్కపెట్టుకోవడంలో అతను గడిపేడు. తను ఇవ్వవలసినవారందరికీ అణాపైసలతో లెక్కకట్టి ఇచ్చివేశాడు. తనకు రావలసిన బాకీలు చాలావరకూ రాబట్టుకున్నాడు. రానివాటికీ రాలేనివాటికీ విచిత్రంగా తెగతెంపులు చేసుకున్నాడు.

ఇద్దరు బాకీదార్లను తను ముక్కూ మొగం యెరగని ఇద్దరు రాజమండ్రీలోని సామాన్య గృహస్థులకు అవార్జీ వేశాడు. మిగిలిపోయిన నోట్లమీద ఈవిధంగా చెల్లు వ్రాసియిచ్చాడు:

"కారణాంతరాలవలన ఈనాడు మా పరిస్థితులు బాగుగా లేకపోవడం వలన, ఈనోటు బాపతు అసలు ఫాయిదాలు యావత్తూ నాకు సుష్టాగా ముట్టినట్లే భావించుకుని చెల్లు వ్రాస్తున్నాను. ఈ నోటుమీద ఇక నానుగాని, నా అనంతరం నా వారసులకు గాని యెటువంటి చర్యకూ యేవిధమైన హక్కూ లేదు."

ఒక్క కొవ్వూరులోని రంగయ్య శ్రేష్టిమాత్రం ఈ విధంగా చెల్లు వ్రాయించుకోడానికి వప్పుకో లేదుట. ఒక్క వారం రోజులలో సొమ్ము సర్దుబాటు చేస్తానని బతిమాలుకున్నాడు. శాస్త్రి భిక్షుకుడికి అన్నగారు. వప్పలేదు చెల్లువ్రాసి: "నిజంగా సర్దుబాటు చెయ్యాలని నీకుంటే—నీ యిష్టం వొచ్చినప్పుడు, నేనున్నా లేకపోయినా, ఏ పరిస్థితిలో వున్నా—సొమ్ము మావూరి కరణంగారి చేతికియ్యి. దాన్ని ఏ విధంగా వినియోగించాలో వారికే తెలుస్తుంది—" అని అంటూ రెండోమాట వినిపించుకోకుండా వెళ్ళిపోయాడుట.

ఆ రంగయ్య వెయ్యిరూపాయల చిల్లరా పుచ్చుకుని ఇప్పుడు కరణంగారి యెదుట నిలుచున్నాడు:

"ఇంకో సమయంలో అయితే యిది కాజేసేవాడినే - నేపెద్ద నీతిమంతుణ్నని కాదు... కాని, ఇందులో ఒక్క పైసా కక్కుర్తిపడితే నే దుంపనాశనమై పోతానేమోనని భయం వేసింది" అని అతను నిజం వొప్పుకున్నాడు.

నలుగురి సలహామీద అన్నిటితోటే యిదీ తేలుతుందనే ధీమాతో కరణం ఆ డబ్బుంచుకున్నాడు - భగవంతుడిమీద భారం వేస్తూ.

మిగిలిన చెల్లుబడి వ్రాయబడిన నోట్లబాపతు మనుష్యులూ వారి కుటుంబాల సహితంగా గొల్లుమన్నారు శాస్త్రికోసం. అతని చరిత్రకు శిథిలంగా మిగిలివున్న సూరమ్మ పాదాలు తడిపేరు కళ్లనీళ్లతో!

ఇంతే కాదు—

ఇటు రాజమండ్రీలోనూ అటు కొవ్వూరులోనూ—అతనికి స్నేహితులూ ముఖపరిచయులూ చాలామంది వున్నారుట. ఇంటింటికీ వెళ్లి వారిని పలకరించి, వారివారి పిల్లలచేతుల్లో పాతికా పరకా పెట్టి వెళ్లిపోయాడుట - ఈమధ్య.

సూరమ్మలూ పేరమ్మలూ విస్తుపోవడంలో ఆశ్చర్యం లేదు. ఇప్పుడు విస్తుపోతున్నది కరణంగారూ—ఆయన పరివారమూను.

శాస్త్రి నిజంగానే మహానుభావుడయి వుండాలి—సమీపిస్తున్న మృత్యువు సంగతి యెరిగినవాడయితే... లేదా, ఏనాడో అతని భవిష్యత్తు చెప్పిన ఏ జ్యోతిష్కుడి లెక్క ప్రకారమో మృత్యువు వేంచేసి వుండాలి.

అయినా—ఆధారం?

దిగులు తీరిగి పదిమంది స్నేహితులనూ చూసి రావచ్చును... ఏదో విధాన అయిసా పయిసా తన వ్యవహారాలన్నీ ఇల్లలికి ముగ్గుపెట్టినట్లు చక్క పెట్టుకోవచ్చును... తనకు పిల్ల పీచూ లేరు కాబట్టి రావలసిన బాకీలు వచ్చినట్లే భావించుకుని వుండవచ్చును—

అతనికి నిజంగానే దక్షిణాధ్రువంనుంచి ఆహ్వానం ఒక నెలరోజులు ముందు కాకపోయినా వారంరోజులు ముందుగానే వచ్చివుండవచ్చును... యెదురు వచ్చిన మృత్యువు మరి పదిగంటలు టైమిచ్చివుండవచ్చును...

"తను చస్తానని యెరిగిన మనిషి చెయ్యవలసిన పనులన్నీ పూర్తిచెయ్యలేక ఈమనిషి?" అని కరణం తనమీదనే నోరుచించుకున్నాడూ అంటే కారణం లేకపోలేదు—

గ్రామ త్రిమూర్తుల మెడను చుట్టుకున్న ఉరిత్రాడే అది!

రెండోనాడు తెల్లవారేసరికి గ్రామచావడి దగ్గిర నలభైరెండో సంవత్సరపు ఆగష్టు ఉద్యమాన్ని గురించి చర్చించేమాదిరి జనం సమకూడివున్నారు. అందరినోటా శాస్త్రి పేరే. పరీక్షించి చూస్తే ఈ జనసమూహంలో పరాయి గ్రామస్థులు కూడా చాలామంది కనపడతారు తాత్కాలికంగా అంతా కులమతకక్షలు విడిచినట్లున్నారు.

ఏమంటే అందులో దావీదు అనే క్రైస్తవ ఉపాధ్యాయుడు ఇద్దరు ముగ్గురు హరిజన శిష్యులతో ఒక సర్వేరాతిమీద చతికిలపడి వున్నాడు. అతని

ఉబ్బిన ముఖం, ఎర్రపడి లోతుకు దిగిపోయిన కళ్ళు, జిడ్డు వోడుతున్న బుగ్గమీసాల నోరు.... అయిదారుగుర్ని హత్య చేసివచ్చినవాడి హృదయంతో శుద్ధ నాస్తికవాది తత్వంతో ఉన్నట్లున్నాడు—ఆరి పోయిన బీడీని ఇంకా పట్టుకుని దేవులాడుతూ.

గ్రామ మునసబుగారి ముందు చేతులు కట్టుకుని వంచుకున్న తల మధ్యమధ్య యెత్తుతూ "అవునూ కాదూ అనేమాటలతోనే సాక్ష్యమిస్తోంది...పూర్వం నలుగురయిదుగుర్ని మార్చి, ఈమధ్యనే మతం పుచ్చుకొని దావీదును తన కూతురుతో సహా కట్టుకుని కాపరం చేస్తున్న "సువార్త"—

శాస్త్రిగారు తమ ఆఖరిరాత్రి ఇంకా చాలా చాలా వ్యవహారాలు చేశాడు...కొన్ని దారుణాలు కూడా చేశాడు...

తనకు బట్టలుతికే చాకలి సత్తి కూతురికి ఒక వంద రూపాయలనోటు బహుమానంగా ఇచ్చాడుట. ఆ డబ్బుతోటి ఊళ్ళోళ్ళవాళ్ళ కుడ్డలతోటే అది పరారయి పోయింది—తను ప్రేమించిన నారపరెడ్డిగారి మేనల్లు డుండే పట్టణానికి!—ఈవిషయం సత్తి రకరకాలుగా వర్ణించి చెపుతోంది ఒకవంక!

గ్రామ చావడిలో కబుర్లు పూర్తయిన తర్వాత శాస్త్రి పెద్దవీధి చివర నేవున్న సందులోకి మళ్ళేడుట. అందులో ఒకసగం పాడుపడిపోయిన ఇంటి పెరడులో గొడ్లసాలలో రెండుతడికలు అడ్డుపెట్టుకుని సుబ్బా యమ్మ అనే వృద్ధవితంతువు నివసిస్తోంది. ఎముకలు చీకి చివికిపోయి నడుము విరిగి వంగిపోయినా — తప్పక, దిక్కులేక—ఈ ముసలిది తెల్లవారగట్లనే లేచి ఒక బిందె భుజాన వేసుకుని పోతుంది. రెండు బ్రాహ్మణ కుటుంబాలకు మడినీళ్లు మోస్తుంది. ముసకతో మూసుకు పోయిన ఆమె గాజుకళ్ళు, అలవాటూ పరిపాటీ అయిపోయిన గోదావరిదాకా నిరభ్యంతరంగా తీసుకు వెడతాయి. ఇదివరకు వారింటా వీరింటా చిల్లరపనులు కూడా చేసేది. ఇప్పుడా వోపిక చచ్చింది...ఇన్ని గంజినీళ్ళు కూడా కాచుకోనడం ఒక్కొక్క రోజు మగతలో మరచిపోతూ వుంటుంది.

ఈ ముసలిది ఏ తుణాన్నో గుటుక్కుమనక తప్పదు. ఆమెకు రాజమండ్రిలో ఒక్కగాను ఒక్క మనమడున్నాడు. వారాలు చేసుకుంటూ చదువుకుంటు న్నాడు స్కూలు ఫైనలులోకి వచ్చాడు.

శాస్త్రి ఆమెకు యెదురుగా నిలబడ్డాడు. పిలి చాడు. గుడ్డి దీపపుబుడ్డి వెలుతురులో ఒక చింకిచాప మధ్యని ముంచుకుట్టుకుని పడివున్న ఆమె కదిలింది... బెదురుతూ ఆ మనిషి వేపు చూసింది. శాస్త్రిని యేమో చాలాసార్లు చూసింది. స్వంత మనమడినే గుర్తుపట్ట గలిగేసరికి ఆమెకు చాలాసేపు పడుతుంది. అటువంటి స్థితిలోవున్న ప్రాణి అతన్ని గుర్తుపట్టగలదా?

ఆయన దగ్గరగా కూర్చుని ఆమెకు అర్థమయ్యే టట్లు చాలాసేపు మాట్లాడి, చివరికి :

"నీ మనవణ్ని చదివించు. వాడేనా వృద్ధిలోకి వొస్తాడు," అంటూ ఆమె వంకరు తిరిగిన చేతులకు ఒక పెద్ద కవరిచ్చాడు.

"ఇందులో బ్యాంకుపుస్తకం రెండు బాండ్లు వున్నాయి. నీ మనవడు బియ్యేదాకా చదువుకోవచ్చు. వెళ్ళి బ్యాంకు వాళ్ళని కలుసుకోమను. నీ మనవడికి ఇది యిస్తే వాడికే తెలుస్తుంది...ఎల్లుండి ఆదివారం— వాడొస్తాడుకదూ..." అన్నాడు.

అతను వెళ్ళిపోయాడు. ఆ మాటలు ఆమె కర్థం కాలేదు. కాగితాలు మనవడికియ్యాలి—వాడు చదువు కుంటాడు'...ఇంతవరకూమాత్రం ఆమెకు ఇంగితం; పదేపదే చెపుతోంది వెళ్ళిపోయిన మనిషి దిక్కే చూస్తూ, ఒక కుడ్డలమూటలాగ, ఆకవర్ని చేతుల్లోనే పెట్టుకుని కూర్చుండిపోయింది — ఆరాత్రీ ఇంకో రాత్రీ తెల్లవారి, మనవడు రాజమండ్రీనుంచి వచ్చే వరకూ—

వాడు అర్థంకాని పరిస్థితులలో కవరు చింపుకుని చదువుకుని అమ్మమ్మని కౌగలించుకొని గొల్లున యేడ్చేడు...

ఎంతోసేపటికి నీళ్ళురాని కళ్ళని వాడి వేపుతిప్పి వాడివీపు నిమురుతూ......"యెవ రాయనా పాపం?"అంది...

"శాస్త్రిగారు—ప్రభల విశ్వనాథ శాస్త్రిగారు" అన్నాడు.

ఆవిడ తల ఆడిస్తూ అంది: "పాపం! పోయాడా? యెప్పుడు? మంచివాడులా గుంది..."

* * * *

ఆ తర్వాత శాస్త్రిగారి విగ్రహం ఊరుకి బాగా ఉత్తరాన వున్న మాదిగగూడెం వేపు నడిచివెళ్ళినట్లు స్థానిక చరిత్రకారుల సాక్ష్యం.

తాటి తోపులోంచి వెడుతున్న ఈ పిలకశాస్త్రి గారిని చాకలివీధిలో చాలామంది పరకాయించి చూశారు. ఇరుకు గుడిసెలనీ కుళ్ళు కాలవలనీ తప్పించుకుంటూ ఏదో నిద్రమత్తులో వున్నట్లున్న అతన్ని చూసి అంతా ఆశ్చర్యపోయారు. అతను వాళ్ళని గమనించినట్లే లేదు.

అటు ప్రభుత్వంవారినీ ఇటు మిషినరీవారిని అండగా చూసుకుని ఒక పాక వేసుకుని అందులో ఒక పాఠశాల నడుపుకుంటున్నాడు దావీదు. ఆదివారాలు ఆ పాఠశాలే ఒక చిన్న చర్చిగా మారుతుంది. దావీదు క్రైస్తవమతంమీద ఉపన్యసిస్తాడు. ఎవరేనా మతం పుచ్చుకుంటారేమో నని తాపత్రయపడతాడు. బాప్తిజం, ఒకటికి అయిదురూపాయలూ పెళ్ళి ఒకటికి అయిదురూపాయలూ—మిషినరీ వారిచ్చే పారితోషికం అతనికి. అతని సంపాదన కాస్తా సువార్త తిరుగుళ్ళకే ఖర్చయిపోతుంది.

పాక నెత్తిమీద ఒక పెద్ద కర్రసిలువ వుంది. చుట్టూవున్న ముళ్ళకంచెల ఆవరణకి ఒక విరిగిపడిపోయిన చిన్న వెదురుకర్రల గేటు—దాని నెత్తిమీద అక్షరాలు చెరిగిపోయిన పొడుగాటి బోర్డు.

శాస్త్రి పాకబయట నిలబడ్డాడు. లోపలగదిలో యుద్ధం జరుగుతోంది. శాస్త్రి పిలిచేడు. ఈకంఠధ్వనికి లోపలియుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది. మరి కాస్తసేపటికి మసిబారిన లాంతరుతో రేగిపోయిన జుట్టుతో దావీదు యెదురుగా ప్రత్యక్షమయ్యాడు—శాస్త్రిని చూసి ఎందుకో నివ్వెరపోయాడు.

అతని వెనకాలే వచ్చి నిలుచున్న సువార్త ముఖం రకరకాల చరిత్ర—ఆ చీకటిచాటునే చెపుతోంది. వయసులో దావీదుకంటే పెద్దది.

ఆ దంపతులిద్దరికీ బ్రాహ్మలూ, అందులో పిలక వున్న బ్రాహ్మలూ అంటే పరమ అసహ్యం—ద్వేషం...ఇతరకులాల వాళ్ళని ద్వేషిస్తే ఆ వూళ్ళో నిల్వనీడకూడా దొరకదని వారెరుగుదురు...

అర్థాంతరంగా వచ్చిన ఈ పిలకబ్రాహ్మడిని చూసి బిత్తరపోయారు. వాళ్ళని పరామర్శిస్తూ కూర్చోడానికి శాస్త్రికి తీరుబడిలేదు—

శాస్త్రి మాట్లాడసాగేడు...

"ఏం దావీదూ! నీకు చివరకి యెవరూ సహాయం చెయ్యనేలేదుట—ఆ మిషినరీవాళ్లు కూడా?"

కడుపులోంచి కోపంతో బాధవస్తున్నా అణిచి పెట్టుకునే ప్రయత్నంతో దావీదు మూలిగేడు; సువార్త చిరచిరలాడుతూ రెండడుగులు ముందుకు వచ్చి దావీదు ప్రక్కనే నిలబడింది...అవసరం వస్తే ఆయెదుటి పిలకని వేళ్ళతో లాగి పారెయ్యడానికి!

"సరే...దానికి మన మేంచేస్తాం...అయిందేదో అయిపోయింది. అనవసరంగామతంచెడగొట్టుకున్నావు. అటూ యిటూ కూడా చెడిపోయావు...నీకు సహాయం కావాలి...డబ్బంటే నేగాని నీకు పొట్టగడవదు. అది నాకు తెలిసింది."

దావీదు యెందుచేతనో గాని "చిత్తవండి—" అన్నాడు. ఇంకోమాట అనడం అలవాటులేని నోరు వాడిది.

"ఈమధ్య నువ్వు పస్తులు పడుకుంటున్నావని కూడా తెలిసింది. నీక్కావలసిన సహాయం నేచేస్తా. ఈ స్థలం కొనుక్కోడానికీ, పడిపోయిన నీ పాక శుభ్రంగా కట్టుకోడానికీ...కొంతనీకు యిబ్బంది తీరే దానికీ కావలసింది అంతా నేనిస్తా—"

దావీదు ప్రపంచాన్ని మరచిపోతున్నాడు—ఎదురుగా నిలచివున్నది యెవరో మేమిటో కూడా అతనికి అవగతం కావడంలేదు—

"నీ నూక్కలు సరిగ్గానడిస్తే ముందు సంవత్సరానికేనా నీకు గ్రాంటువస్తుంది...ఈలోగా కలో గంజో కాచుకుని బ్రతుకుతూవుండు..."

సువార్త క్రిందిదవడ రెండుఅంగుళాలు జారిపడిపోయింది. దావీదు రెండుచేతులూ కలిసి దణ్ణం పెడుతున్నాయి. ఎదురుగా శాస్త్రి స్వరూపంలో వాడికి ఏసుప్రభువు కనపడుతున్నాడు.

చదువుకున్నవాడివి...ఒక్క షరతు...దిక్కులేని పదిమందిపిల్లలకి చదువుచెప్పి...వాళ్ళందర్నీ నీ మతంలోకి ఎలాగేనా అయిదురూపాయల లాభంకోసం మార్చెయ్యాలనే దుర్బుద్ధిమాత్రం పోగొట్టుకో....ఎప్పటికేనా అది నీకు మంచిది....

శాస్త్రి వెళ్ళిపోతూ ఆగి సువార్తను చూస్తూ దావీదుతో అన్నాడు:

"ఇది యింకా వెనకటి పద్ధతిలోనే వున్నట్లు వింటున్నాను. బోగంది కూడా ఒక నీతికి కట్టుబడివుంటుంది. నీతో కలోగంజో తాగుతూ బతుకుతుందా... సరే...ఇష్టంలేదూ మెడపట్టుకుని గెంటెయ్యి... నీకు పెళ్ళాం లేకపోయినా వచ్చిన ఇబ్బందిలేదు. కూడూగుడ్డా వున్నవాడికి పెళ్ళాం. ఈ యెనుబోతు నీకెందుకు? ఒక్కసారిగా యెందరికి పెళ్ళాం అవుతుంది ఇది?...దీని వ్యవహారం ఈ తెల్లారేలోపునే తేల్చుకో—"

ఆమాటలు వింటూ, అతని చూపులు చూస్తూవున్న సువార్త పాతాళంలోకి దిగిపోతోంటే, దావీదు అన్నిటికీ చిత్తంకొడుతూ లెంపలు వేసుకుంటున్నాడు.

దావీదు దంపతులు ఆ రాత్రి ఏసుప్రభువుని మరచిపోయారు. అందుకు శిక్షగా తెల్లవారేసరికి వారికి వినబడింది—ఒక పిడుగులాగ—శాస్త్రి మరణఘోష.

"ఇంతకీ ఆ ప్రభువు కృప నాకులేదు. ఆ పంతుల్ని ఈరాత్రే తీసుకుపోవాలా?" అని తన అసమ్మతిని తన ప్రభువుకు యథేచ్ఛగా తెలియజేసుకున్నాడు దావీదు.

అంతేకాదు—పంతుల్ని ఎలాగయినాసరే తన పరలోక సామ్రాజ్యంలోకి తీసుకోవలసిందని దావీదు దంపతులు ప్రభువును ప్రార్థనలు కావించారు!

* * * *

శాస్త్రి చనిపోయి ఐదురోజులయింది. గ్రామం అతన్ని మరచిపోతోంది. కాని—కరణం మునసబులకు మాత్రం మరవడానికి వీలు కుదరడంలేదు.

దినపత్రికలలోని ప్రకటనకు సమాధానంగా మూడు ఉత్తరాలు వచ్చేయి. ఉత్తరంకంటే పెద్దదైన టెలిగ్రాం ఒకటి వచ్చింది.

బంధువులు ముగ్గురూ ఎక్కడెక్కడో వుంటున్నారు. వారసులయ్యే ఆస్కారంమాత్రం తమకు కనపడటం లేదని విచారించారు. ఈప్రపంచంలో ఏదైనా జరగవచ్చు. అందుచేత వారివారి వావివరసలుపూర్తిగా ఇచ్చుకున్నారు. నిలుచున్న పళంగా రావడానికి గవర్నమెంటు ఉద్యోగాలు—సెలవలు మంజూరు కావాలి. "ఇదేమాదిరి ఉత్తరాలు మీకు ఇంకా అనేకం వస్తాయికదా—బంధువర్గం పూర్తిలిస్టు మీ దగ్గరే ఈసరికి తయారయి వుంటుంది. నాకు వారసుణ్ణయే యోగ్యత వుందని మీకు తెలిస్తే దయచేసి టెలిగ్రాం ఇప్పించండి...రెక్కలుకట్టుకుని కుటుంబంతో అక్కడ వాలగలను—"

అనే భరతవాక్యంతో మూడూ ఒకే ముసాయిదాకు తీసిన నకళ్లులాగ ఉన్నాయి ఉత్తరాలు! ఒకదానికొకటి సంబంధంలేని మూడు వూళ్ళనుంచి వచ్చేయి.

ఇక నాలుగవది—అది టెలిగ్రాఫు ఉత్తరం. దాని తత్వమే వేరు...టూకీగా :

"నేను బంధువునే అయినా వారసుణ్ని కూడా అవగలిగే యోగ్యత వుంటే—నాలాంటి వారసుల్లు విశ్వనాథశాస్త్రి గారికి ఒక వందమందేనా వుండాలి. ఇంతమందిమీ తగవులాడుకోవాలి. కోర్టులచుట్టూ తిరగాలి. కాబట్టి, ఆ స్తిపాస్తుల వ్యవహారాలు నాకు సంబంధించినంతవరకూ అతి దూరంగా ఉంచండి.

"ఎంతటి బలగం ఉన్నవాడికయినా సమయానికి ఒకరూ దగ్గరవుండక పోవచ్చును. ఆయనకి యథావిధి కర్మ చెయ్యడానికి ఆత్మీయులెవరూ లేకపోయిన పక్షంలో మీరు వెంటనే నాకు టెలిగ్రాం ఇవ్వండి. ఏవిధమయిన ఇతర మీమాంసలూ మీరు పెట్టుకోనవసరం లేదు...నేబయలుదేరి వస్తాను. నాకు సెలవు దొరకదూ, ఉద్యోగానికి రాజీనామా ఇస్తాను. యథావిధిగా కర్మచేస్తాను. తర్వాత మాసికాలూ అవీఇక్కడ పెట్టుకుంటాను. ఈవిధంగానైనా వారికి నా కృతజ్ఞత తెలియచేసుకుంటాను.

"అక్కడికి నేను తీరా వచ్చినతర్వాత ఆయన తాలూకువారు యెవరేనా వస్తే, సరేసరి వారేచేస్తారు నేనేమీ అనుకోను.

"నాది ఒక్కటే షరతు. ఆస్తిపాస్తుల వ్యవహారం నాకనవసరం. ఒకవేళ నాకు ఏమైనా హక్కులుండుకున్నట్లయితే వాటి నన్నిటినీ ఈ ఉత్తరం ద్వారా వదులుకుంటున్నాను. వెంటనే టెలిగ్రాం మాత్రం తప్పకుండా ఇవ్వండి..."

సమాధానానికిగాను కావలసినంత డబ్బు కూడా అక్కడే చెల్లించాడు ఈ పెద్దమనిషి....ఇంత పురాణమూ చెప్పి తన బంధుత్వంమాత్రం ఏమిటో తెలియచేయనేలేదు !

"శాస్త్రికి తగ్గవాళ్ళల్లాగే కనపడుతున్నారు ఈ నలుగురూ—"అన్నాడు నారపరెడ్డి. "ఒక్కడికీ ఆశలు లేవు—"

"లేకేం? ఆ ముగ్గురికీ వుంది. ఈ టెలిగ్రాం ఆయన ఎవడో సన్యాసిలాగున్నాడు. పేరేమిటి?'' అని మునసబు.

"ఆర్. సి. చంద్రం'' అంటున్న కరణం కళ్లు వీధిలో నిలుచున్న అనేకమంది సరిక్రొత్త ముఖాల మీద పడ్డాయి.

వీరంతా ఇప్పుడు స్టీమరులో దిగిన శాస్త్రి బంధువర్గంట—

ఈ నాల్గురోజులనుంచీ రవంత జ్వరం తగులుతున్నట్లనిపించిన కరణానికీ టెలిగ్రాం చదువుతోంటే నే పూర్ణజ్వరం ముంచుకువచ్చింది. ఈ బంధువుల సైన్యాన్ని చూసేసరికి అతని కళ్ళకి మైకమూ శరీరానికి కుదుపూ ప్రారంభమయి, ఆ జ్వరానికి ఒక 'మలేరియా' పరపతిని తీసుకువచ్చాయి

బంధువుల నందర్నీ తరలించుకొనిపోయి సూరమ్మకు వప్పగించాడు మునసబు. ఎంత కృంగిపోయి వున్నా వారినందరిని ఆమెగౌరవించింది, ఆదరించింది, భోజనాలకి యేర్పాటులు చేయసాగింది. పాడుపడిన ట్లున్న ప్రభల వారింటికి ఇప్పుడు ఒక పెళ్ళికళ వచ్చింది...

కరణం తీరుబడిగా కూర్చుని ఆలోచించసాగేడు. నలుగురు పెద్దమనుష్యులలోనూ యెవరిని పిలవడమా—లేక అందర్నీ పిలవడమా? మళ్ళీ మనకెందుకీ బాధ్యత—రేపు గవర్నమెంటు ప్లీడరే అన్నీ చూసుకుంటాడు...ఈ విధంగా పరిపరివిధాల పరుగులెడుతోంది అతని మనసు.

"మర్యాదకోసమేనా డబ్బుకట్టిన ఆ టెలిగ్రాం ఆయనకి ముందు ఏదో వో సమాధానం పంపించు" అన్నాడు రెడ్డి.

"అన్నీ అయోమయంగా ఉన్నాయి. మీకుఇష్టమయితే రావచ్చు—" అని టెలిగ్రాం ఇవ్వబడింది.

ఆ మర్నాటికి ఒక పాతిక ఉత్తరాలు వచ్చాయి. అవన్నీ శాస్త్రిగారి పరిచయుల దగ్గర్నుంచీ స్నేహితుల దగ్గర్నుంచీ. శాస్త్రి మరణానికి తమ విచారాన్ని తెలుపుతూ అతని కుటుంబానికి (?) సానుభూతులు పంపుతున్నారు.

అందులో ఒకే ఒక ఉత్తరం కొన్ని పేజీలు వుంది. అది చదువుకోలేక పరాకు చిత్తగిస్తున్న కరణానికి నిలుచున్న పళంగా రావలసిందని సూరమ్మ దగ్గర్నుంచి కబురు—

ఇంటికివచ్చిన బంధువర్గం అంతా మెల్లమెల్లగా ఇల్లంతా అల్లుకు పోతున్నారుట. సూరమ్మ మనస్సు అంగుకు మాత్రం వప్పడం లేదు.

"ఈ ఆస్తికి అధికారి యెవరో తేలేవరకూ అందరూ పరాయివాళ్ళే—నేనూ పరాయిదాన్నే! ఈ సరుకు నా చేతికి వప్పగించేరు కాబట్టి పూచీపడవలసిన బాధ్యత కూడా నాది. రేపు ఆ అధికారి యెవరో వొచ్చింతర్వాత నేనూ నెత్తిమీద చెంగువేసుకొని పోవలసిన దాన్నే కదా...ఈ పెద్దమనుషుల్ని కాస్త అదుపాజ్ఞలలో వుంచమనండి. నన్ను వీరెరుగరు—వీళ్ళని నేనెరుగను...లేకంటారూ—మీరే వో మనిషిని ఇక్కడ యాజమాన్యానికి పెట్టండి—" అని నిక్కచ్చిగా అన్నది.

ఆమె మాట చెల్లక తప్పలేదు. మొహమాటాలు లేని మునసబు బంధువు లందరితోటీ నిక్కచ్చిగా చెప్పేశాడు.

"పూచికపుల్ల పోయిందని ఆవిడ ఫిర్యాదు చేసిందా అంటే మీ అందర్నీ తలార్ల చేతికిచ్చి కొవ్వూరు తాలూకా ఆఫీసుకి తోలించేస్తాను—" అన్నాడు.

ఈ మాత్ర బాగా పనిచేసింది బంధువులకి.

* * * *

ఆ సాయంత్రం తీరుబడిగా కూర్చుని మిగిలిపోయిన పెద్ద ఉత్తరాన్ని చదువుతున్నాడు కరణం. రెడ్డీ మునసబూ వింటున్నారు—

అది ఎవరో వక స్త్రీ దగ్గర్నించి—

మంచి విద్యావతీ సంస్కారం గలదీ లాగ కనపడుతుంది...అందులో కొన్ని ముఖ్యమయిన భాగాలీదిగువను ఇస్తున్నాను:

"ఈ వుత్తరం ఎవరికి వ్రాస్తున్నానో యెందుకు వ్రాస్తున్నానో తెలియడం లేదు. కుటుంబం లేని శాస్త్రిగారి కుటుంబానికా? లేక...నాకు నేనే వ్రాసుకుంటున్నానా?...లోనిబాధ—ఆ వేదన బయటికి కక్కకోక తప్పదు...

"ఈ వుత్తరం చివరకి ఎవరు చదువుతారోగదా. వినయిపోతేనేమి ఒక కష్టజీవి చరిత్ర ముగిసిపోయింది. ఒక మహానుభావుడు అంతరించిపోయాడు.

మంచీ చెడ్డా కూడా మూర్తీభవిస్తేనే గాని పూర్ణ మానవుడు కాలేడేమో! శాస్త్రిగారు అటువంటివాడు ...చివరికి తనకు మిగిలిన బంధువులనీ, బంధువుల కంటే యెక్కువ అయిన మిత్రులనీకూడా విడిచివేసి ఒక పుష్కరంనుంచీ తన జీవితాన్ని అజ్ఞాతంగా గడుపుకుంటున్నవాడు.

* * *

"ఈయన ఎవరు?"

"మద్రాసులో '—' వీధిలో '—' పేరుతో వున్న మహాసంస్థ సంస్థాపకుడు. లక్షలమీద వ్యాపారం చేసినవాడు. సర్వ నాశనం అయిపోయిన అభాగ్యుడు.

"సుమారు పన్నెండు సంవత్సరాల క్రితం వరద రోజులలో కొవ్వూరు పోలవరాల మధ్య ఒక లాంచీ మునిగిపోయింది. అందులో అంతా పెళ్లివారున్నారు. ఆ లాంచీలోనే తన సర్వస్వాన్నీ సమర్పించుకున్నాడు శాస్త్రిగారు.

"తమ్ముళ్లు, అప్పచెల్లెళ్లు, భార్య బిడ్డలు అంతా గోదావరి తల్లి కడుపులో పడిపోయారు-సుమారు నూరుగురకు పైగా వున్న ఆత్మీయులు. ఆ లాంచిలో ప్రయాణం చెయ్యని శాస్త్రిగారూ తల్లిదండ్రులూ మిగిలిపోయారు!!

"ఆ క్షణంనుంచీ మనసు చితికిపోయిన శాస్త్రిగారు కొన్ని దినాలు మాత్రం మద్రాసులో వున్నారు. సంస్థను తన క్రింది ఉద్యోగస్థులందరికీ పంచి ఇచ్చేసి ఎక్కడికో వెళ్ళిపోయారు. ఆ తర్వాత వారి విషయం ఏమయ్యిందీ ఎవరికీ తెలియలేదు. కావాలని మిత్రులందరినుంచీ, పరిచయులందరినుంచీ, పరిచిత స్థలాల నుంచీ దూరమైపోయారు. తమ ఆస్తిపాస్తులంతా అందరికీ పంచి ఇచ్చివేసి, చేతిలో అణాకాసు కూడా మిగుల్చుకోకుండా ఎక్కడో విశాల ప్రపంచంలో మిగిలిపోయారు.

"ఇప్పుడు తెలిసింది. వారి ఆత్మీయుల నందర్నీ పొట్టను పెట్టుకున్న అదే గోదావరి గట్టున ఈనాడు వారి శరీరం కూడా భస్మమయిపోయిందని..."

* * *

కరణం గోదావరిగట్టు వేపు అక్కసుతో కళ్లు చించుకుంటూ చూస్తున్నాడు. భార్యా బిడ్డలనీ, అన్నదమ్ములనీ, వారి వారి సంసారాలనీ ఒకేసారి పోగొట్టుకుని గోవుపాదాల రేవులో తర్పణాలు విడుస్తున్న నిర్భాగ్యుడు, ఏకాకి శాస్త్రి అతని కళ్ళల్లో మెదులుతున్నాడు.

ఈ చావులతో చింపి పారవేసిన గుండె కలిగి, మంచానికి తాపసమయిపోయి నశించిపోయిన అతని తండ్రి; పర్వతాల బరువుతో అణగిపోతూ వున్నా తొట్రుపడుతున్న పాదాలను గోదావరికీ ఇంటికీ మధ్య నడుపుకు పోతున్న పండి రాలిపోయిన అతని తల్లి.

నిలువునా కుటుంబం కూలిపోయినా, ఆ సంగతి ఏమీ యెరగని ఈ కుగ్రామంలో జీవితాన్ని నడుపుకుంటూ, గంభీర యోగముద్రగల ముఖవర్చస్సుతో కొన్ని దినాల క్రితం వరకూ వీధులవెంబడి నడయాడిన శాస్త్రి...ఒక ఏనుగు...అతని కళ్ళముందు చిరునవ్వులు చిందుతున్నాడు. అతని ముందు తానెంత? చీమ చిటుక్కుమంటే గుండె పగిలి ఉక్కిరిబిక్కిరయ్యే తమ బతుకు లెంత!

ఆఖరి రాత్రి అతని చిరునవ్వుల వెనకాల యెంతటి దారుణమైన రహస్యం...ఒక తెరింపరాని తిమిరం...ఉన్నది. చివరికి, ఒకే మారు క్రింద నిద్రపోతున్నదే అయినా సూరమ్మకు వీసమెత్తు కూడా తెలియదే ఈ చరిత్ర.

ఉత్తరం వింటున్న నారపరెడ్డి చటుక్కున లేచి వెళ్లిపోయాడు. ఏ విషయం ఎన్నడూ ఎరగని రెడ్డి ఆ రాత్రి తెల్లవార్లూ నిద్రలో ఏడుపులూ పలవరింతలూను. మునిగిపోతున్న లాంచీలలో అతను అన్ని నదీనదాలలోనూ ఆ వొక్క రాత్రిలోనూ యాత్రలు ముగించుకుని వచ్చాడు.

* *

సుమారు ఎనిమిది గంటలయ్యింది. ఎలాగో హితవు చేసుకుని చుక్కెడు కాఫీ తాగిన కరణంగారు, జ్వరం మసుపుతో శాలువా కప్పుకుని కూర్చున్నారు. దగ్గరే పరిస్థితులు నెమరు వేస్తూ మునసబూ, ఉబ్బి ఎర్రబడిన కళ్ళను నిమురుకుంటూ నారపరెడ్డి కూర్చుని వున్నారు.

రాజమండ్రీ స్టీమరు వచ్చింది కాబోలు. వీధినే కొందరు ప్రయాణీకులు వెడుతున్నారు. ఓరకంట

మునసబు వాళ్ళను లెక్కపెడుతున్నాడు. చూస్తూ వుండగానే ఎవరో దొరగారు కరణం ఇంటిముందు నిలబడ్డారు. ఆయన వెనక్కాలే నెత్తిమీద సోలు పెట్టే హోల్డాలులతో కూలివాడు.

ఎవరు చెప్మా అనే లెక్కలోనే ఇంకా మున సబు చూస్తున్నాడు. దొరగారు మెట్లెక్కుతున్నాడు. ఆయన బూట్ల చప్పుళ్లు కరణం గుండెలలో రైళ్లను పరుగెట్టిస్తున్నాయి. అతనికి ఈ ప్రపంచం యావత్తు జనాభామీదా విపరీతమైన కోపం ముంచుకు రాసాగిదిం. అంతేకాదు, తన సంసారం మీద వైరాగ్యం కూడా వచ్చేసింది—

ఎవరో .... ఏ పెద్దాఫీసరో ... యేమిటో— మంచి సమయానికే విరుచుకు వచ్చాడురా దేవుడా అని బెంబేలు పడ్డాడు. ఇవన్నీ పరీక్షలు...అగ్ని పరీక్షలు...వీటిని నిలవ్రతొక్కుకుంటే వైతరిణి దాటినట్లే. శాలువా ఒకమూలకు విసిరేసి, కవచ ఖడ్గాలు పారవేసిన యోధుడి మొహం పెటి, కరణం గబగబా నడవలోకి నమస్కారాలతో పరుగులు పెట్టేడు. అతని క్రాఫింగూ పిలకా గోదావరీ స్నానం చేసినట్లున్నాయి. కుర్చీని అరుగు మీదికి లాగి చేతులు కట్టుకుని నిలబడ్డాడు మునసబు. ఒక లాంతరు స్తంభం వేషం వేశాడు నారపరెడ్డి.

కుర్చీలో కూర్చోకుండానే ఆ దొరగారు స్వచ్ఛమైన తెలుగులో అందుకున్నాడు.

"ఈ వూరి కరణంగారు—?"

"చిత్తం...ఏం సెలవో—"

"క్షమించాలి మీరే నన్ను," ఆయన దిక్కులు పరికించి సంగతి గ్రహించినట్లున్నాడు. "నేను మిమ్మల్ని మింగడానికి వచ్చిన ఏ ఆఫీసర్నీ కాదులెండి" అన్నాడు.

అర్థంకాని గ్రామ పెద్దలు ముగ్గురూ ముఖాలు చూసుకోసాగేరు.

"సరే...మీకు కలకత్తానించి టెలిగ్రాం ఇచ్చిన పెద్దమనిషిని నేనే!" అనేశాడు.

ఆ మాటలు కరణం మేధస్సులోకి ప్రవేశించి, అతన్ని మూడు పిల్లి మంత్రాలను కొట్టించింది.

"మీ టెలిగ్రాం సమాధానం చూసుకోకుండానే నే వచ్చేసినందుకూ, ఇటువంటి స్వాతంత్ర్యం తీసుకున్నందుకూ మీరంతా నన్ను క్షమించాలి—" అంటూ చంద్రం, వద్దంటున్నా, అరుగు మీదనే చదికిల పడ్డాడు. "అసలు సంగతేమంటే—విశ్వనాథ శాస్త్రిగారికి నేనెంతో ఋణపడి వున్నాను. ఆయన వల్లనే చాలా సహాయం పొందాను. ఆ ఋణం తీర్చుకో దలచాను. కర్మ నా చేతులతోనే చెయ్యాలని బుద్ధి పుట్టింది. పత్రికా ప్రకటనా, నే మీకిచ్చిన టెలిగ్రాం కాపీ మా డైరెక్టరు ముందు పెట్టి-సెలవు ఇవ్వకపోతే రాజీనామా పెట్టేస్తాను-అన్నాను నవ్వుతూనే. ఆయన ఏమనుకున్నాడో — "ఆలస్యం యెందుకు? వెంటనే వెళ్లు" అన్నాడు. బయలుదేరి వచ్చాను..."

ఇప్పటికి 'షాక్' నుంచి రవంత తెప్పరిల్లిన కరణం కాళ్లు ఇంకా వణకుతూనే వున్నాయి.

"విమానం మీద విశాఖపట్టణం దాకా వచ్చి, అక్కణ్ణించి ప్యాసెంజర్లో వచ్చాను. కర్మ యెన్నో రోజునుంచీ చేస్తారో నాకు తెలియదు. ఆయన కర్మ చెయ్యడానికి నాకూ అధికారం వున్నా, అది యెటువంటిదో మీరడగవద్దు— నే చెప్పను..."

ఆజాను బాహుడూ, స్ఫురద్రూపీ, ముప్ఫై అయిదు సంవత్సరాల వయసులోనూ వున్న చంద్రాన్ని చూస్తూ చాలాసేపు కరణం ఏవేవో మంత్రాలు జపం చేసుకుంటూన్నట్లు కనపడ్డాడు. చివరికి ఒక నిర్ణయానికి వచ్చి:

"ఏది యేమైనా అన్ని వివరాలూ మీకు చెప్పెయ్యడానికి తీర్మానించుకున్నాను. వినండి— అంటూ చదికిల పడ్డాడు.

"క్షమించండి. ఆ వ్యవహారాలు నాకు వద్దు. మీరు చెప్పవద్దు. ఈ సూత్రానికి మీరూ నేనూ కట్టుబడి వుండడం చాలా మంచిది—ఉత్తరోత్తరా; ఎవరేనా కర్మ చేస్తున్నారా?"

"లే—దు"

"అయితే ఈవేళనించి చెయ్యొచ్చునా? నా సామాను ఎక్కడ పెట్టుకోను...అబ్బే—ఆయింట్లో వొద్దు: ఏ గొడ్లపాకేనా చాలు—అక్కడి జనానికీ నాకూ ఏవిధమైన ప్రమేయమూ వుండడానికి వీలు లేదు."

చంద్రం మాటలకు ఎదురు చెప్పగల స్తోమతు ఎవరికీ లేకపోయింది. శాస్త్రిగారి ఆవలి పెరడులో వున్న

గొడ్లసాలలో చంద్రం మకాం పెట్టి దినచర్య ప్రారంభించాడు.

* * *

విశ్వనాథశాస్త్రిని వైతరిణి దాటించారు. కాని, అతని లిటిగేషను మాత్రం ఇంకా ఈవలిగట్టు కూడా చేరలేదు. శుద్ధ శ్రోత్రియుడి విధానంలో చంద్రం కర్మ చేశాడు. కూడా తెచ్చిన డబ్బు రెండు చేతులా ఖర్చు చేశాడు. గ్రామంలోగల చతుర్వర్ణాలవారికీ సమారాధనలు జరిపేడు. రెండుమూడు సార్లు ఆస్తిపాస్తుల వ్యవహారాలూ బంధువర్గపు గొడవలూ అతని దగ్గర మళ్లీ యెత్తబోయేసరికి, ఆ విషయాల నన్నిటినీ ఒక్క చిరునవ్వుతో త్రోసిరాజన్నాడు చంద్రం.

"మీకు ఏ ఆశా లేకపోయినా మీ అనుభవంతో మాకు కొంత సలహా యివ్వవచ్చును కదా—" అని కరణం బాధపడ్డాడు.

"అవసరం లేని వ్యవహారాలలో ఎంత మాత్రం కలగజేసుకోనూ అని ప్రతిజ్ఞ పట్టినవాడిని." అంటూ చంద్రం లేచి వెళ్లిపోయాడు.

ఆ రోజు కరణం గారికి టపాలో కలెక్టరు ఆఫీసు నుంచి ఒక పెద్ద దస్తరం వచ్చింది. అందులో శాస్త్రి గారిని గురించిన ఒక మెమో కాగితం కూడా వుంది— లోగడ శాస్త్రి మరణాన్ని గురించి కరణం చేసిన మామూలు రిపోర్టుకు ఇది సమాధానం.

ఆ మెమో చదివిన కరణానికి ముందు కొంత ఉక్కిరి బిక్కిరి అయినా, తర్వాత కొంత త్రాణ చేరింది.

ఇంక వారం రోజులకు తాను దివంగతుడవుతాడనగా, శాస్త్రి ఏలూరు రిజిస్ట్రారు ఆఫీసులో ఒక విల్లు రిజిస్టరు చేసి, దాన్ని కలెక్టరుగారి చేతికి స్వయంగా అందించుకున్నాడుట. సర్కారువారి ప్లీడరుద్వారాగాని తన గ్రామ పెద్దలద్వారాగాని తన అనంతరం సదరువిల్లును అమలు జరిపించవలసినదిగానూ, తన అనంతరం గాని విల్లును బహిరంగ పరచడానికి వీలు లేకుండా చేయవలసిందనీ కోరినాడుట. ఈ అమలు జరిపేటందుకయ్యే ఖర్చులు శాస్త్రి వారసులనుంచి ప్రభుత్వం రాబట్టుకో వచ్చును. కలెక్టరుగారు శాస్త్రి గారికి ముఖ్య స్నేహితులు కాబట్టి ఈ బాధ్యత లన్నిటికీ వప్పుకున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా కరణం వెంటనే యేలూరు వెళ్లి విల్లు నకలుతో ఆ రాత్రికే తిరిగి వచ్చేడు. గ్రామ పెద్దలు ముగ్గురూ విల్లులోని వివరాలు చదువుకున్నారు.

"నాకు ఇతరత్రా బంధువులుగాని వారసులుగాని లేరు. నా ఆస్తిపాస్తులు షెడ్యూలు, దాఖలాగా, రాజమండ్రీ ఆంధ్రబ్యాంకులో వున్న రొక్కం నిల్వతో కలిసి సుమారు అరవై యెనిమిది వేల రూపాయలు...

"నేను చనిపోయే లోపున చెయ్యబోయే దాన ధర్మాలు ఇందులో ఉదాహరించడం లేదు. వాటికి సొమ్ము వేరే కేటాయించుకుని అట్టే పెట్టుకున్నాను. నేను యెవరికీ యేవిధమైన బాకీలు లేను. నాకు ఎవరి నుండీ యే బాపతు సొమ్ములూ రావలసి లేవు.

"నా యావత్తు స్థిరచరాస్తులూ, షెడ్యూలు దాఖలాగా, క్రింది మినహాయింపులు పోను, దాన విక్రయ సర్వాధికారాలతోనూ, ప్రస్తుతం రాజమండ్రీ పట్టణ—వీధి కాపురస్తురాలు, — గారి కుమారిత అయిన చి॥ సౌ॥ సీతారావమ్మకు చెందవలెను. ఈమె ప్రస్తుతపు చిరునామా......ఈ ఒక్కతే నాకు చట్టరీత్యా వారసురాలై వున్నది. తన వారసత్వాన్ని ఋజువు చేసుకునే డాక్యుమెంట్లు ఆమె దగ్గర వున్నవి.

"మినహాయింపులు :— ఈ క్రింది దానధర్మాలు నా ఆస్తి నుండి చేయవలెను: ఇదే గ్రామంలో మాదిగ గూడెంలో నివసిస్తున్న క్రైస్తవ ఉపాధ్యాయుడు దావీదుకు రూ. 1500; మా పొలం ఈనాటివరకూ మకు చేస్తున్న రైతు, పోలయ్యకు రూ. 500; ఎడ్ల జతలు కూడా ఇతనికే ఇచ్చి వేయవలెను."

ఆ తర్వాత సుమారు అయిదు వేల రూపాయలకు సరిపడే దానధర్మాల జాబితా ఇవ్వబడింది. ఇవి అనేక చిల్లరమల్లర సంస్థలకీ వ్యక్తులకీ చేయబడినవి. వ్యక్తులంతా ఆ వూరివారే. కాని, అందర్నీ ఆశ్చర్యంలో ముంచినవి రెండు విషయాలున్నాయి. సూరమ్మ పేరెక్కడా లేదు. ఆమెకు దమ్మిడీకూడా ఇవ్వబడలేదు. మరీ విచిత్రమయింది ఉపసంహార వాక్యం.

"నా అనంతరం నాకు జరపవలసిన కర్మకాండను గురించి యెవరూ విచారించవలసిన అగత్యం

లేదు. అది యెవరో ఒకరు నెత్తిమీద వేసుకుని చేస్తారు. చెయ్యకపోయినా ఇబ్బంది లేదు..''

విల్లులో తన పేరుగాని, తన భవిష్యత్తుకు మార్గం చూపడంగాని జరగలేదని వినిన సూరమ్మ విస్తుపోయింది. "నే నేం చేతును, నన్నింత అన్యాయం చేసేశాడే—" అని గోలుగోలుమంది.

ఆమె గోల వినడానికి కరణం మినహాయించి ఎవరూ లేరు. వారసుల మనో బంధువులమనో వచ్చిన జనమంతా పదమూడవరోజు కాబట్టి ఎవరిదారిని వారు వెళ్లిపోయారు. చంద్రం ఎక్కడికో వెళ్ళి వున్నాడు. అతని సామానింకా అక్కడే కనపడుతోంది...

ఈ కథను కంచికి పంపించెయ్యాలనే వుద్దేశ్యంతో గ్రామ పెద్దలు ముగ్గురూ విల్లులో వుదహరింపబడిన సీతారావమ్మ చిరునామా తీసుకుని రాజమండ్రీ వెళ్ళేరు.

సుమారు మూడు గంటలకల్లా ఒక చిన్న అద్దె కొంప ముందు ఆగి తలుపు తట్టేరు. ఆ యింటి పరిసర స్థలాలూ వాతావరణం కరణానికి మహా రోతా, తీరని అనుమానం కలిగించసాగేయి. ఆ వీధిలో సంసారులెవ్వరూ ధైర్యంచేసి నివసించరనే విషయం జగత్ప్రసిద్ధం.

ఒక స్త్రీ తలుపు తెరిచింది. కళ్లూ ముఖం వాచి జబ్బుపడిన మనిషిలాగ కనపడుతోంది. ఎవరో పెద్ద మనుష్యులను చూసేసరికి కలతపడి తలుపుచాటుకు పోయి నిలుచుంది.

కరణంకంటే ముందు మునసబు మాట వినిపించుకోకుండానే గదిలో అడుగు పెట్టేడు. ఒకరి వెనకాల వొకరు అక్కడ పరచివున్న చాపమీద ఆసీనులయ్యారు. కరణం ఆమె వేపుతిరిగి, మనస్సు పరిపరివిధాల పోతూవున్నా, ప్రారంభించాడు:

"అమ్మా! ప్రభల విశ్వనాథశాస్త్రి గారిని మీరు యెరుగుదురా?"

ఆమె కొంతసేపు సందేహించింది. ఆమె ముఖం ప్రేత కళపడడం కరణం గ్రహించాడు. ఆమె 'చిత్తం' అని వసిగింది.

"వారు మీకేమవుతారు?"

ఆ ప్రశ్న వస్తుందని ఆమె యెరుగును. ఈవిధంగా ముగ్గురు పెద్దమనుష్యులు వచ్చేరనే సరికే ఆమె ఒక వంక గజిబిజ అవుతోంది. ఆమెకు కళ్లనీళ్లు తిరిగేయి కాని ధైర్యంతోనే అంది—

"బంధుత్వాలిప్పుడెందుకు కండి... వారు కీర్తిశేషులయ్యేరు కదా... ఆవిషయాలు తీసుకురావడం వలన యెవరికీ యేమీ లాభంలేదనుకుంటాను .."

"అలా గనకండమ్మా. ఆవిషయా లన్నీ ఇప్పుడవసరాలయి వచ్చేయి. మీరే సీతారావమ్మగారనే వుద్దేశ్యంతో మాట్లాడుతున్నా—"

"చిత్తం—"

"మీ తండ్రిగారి పేరు?"

"సూర్యనారాయణ మూర్తిగారు"

"మీ స్వస్థలం—?"

ఆమె చెప్పింది. తాను ఒంటరిగానే వుంటున్నాననీ, ఒక నెలా పదిహేనురోజుల క్రితం వరకూ తాను శాస్త్రిగారిని యెరగననీ చెప్పింది.

"అంటే - స్వతహాగా వారు మీకు బంధువులు కారు—?"

"కారండి—"

"పరిచయులూ స్నేహితులూ—"

"కారండి..."

"చాలా ఆశ్చర్యంగా వుంది" కరణం తన సహాధ్యాయులిద్దరి ముఖాలు జిజ్ఞాసతో చూస్తూ కొన్ని నిమిషాలు గడిపివేశాడు. "అయితే-ఆ నెలా పదిహేనురోజుల క్రితం పరిచయం మీకెలాగయ్యిందో అడగవచ్చు ననుకుంటాను" అని అతివినయంగానే అన్నాడు.

ఆ ప్రశ్నలవర్షానికి ఆమె గజగజలాడిపోతోంది. తలవంచుకునే ఆమె చెప్పసాగింది—

"ఆరోజు యెండదెబ్బకి ఆయన శోషొచ్చి పడిపోయారు - ఈ అరుగుమీద స్మారకం లేకుండా... మా పిల్లాడు యెవరో తాత పడిపోయాడని చెప్పేసరికి, ఆయన్ని లోపలికి తీసుకొచ్చి ఇన్ని గంజినీళ్లు పోశాను. ఆ రాత్రి తెల్లవార్లూ ఆయనికి జ్వరం కాసింది. జ్వరంతోటే మర్నాడు వెళ్ళిపోయారు... దరిమిలాని వాడిక్కూ మాలిన చరిత్రంతా విన్నారు..."

ఇంకామె చెప్పలేక పోయింది.

—ఏమయితే నేమి. ఆ దిక్కుమాలిన వ్యక్తికి తన ఆస్తంతా ధారాదత్తం చేసేశాడు శాస్త్రి. ఎవరికేది ప్రాప్తమో ఈశ్వరుడికే తెలియును!

కరణంగారు మనసుండబట్టలేక పోయారు. శాస్త్రిగారి ఆఖరి దాతృత్వాన్ని విపరీతంగా కొని యాడుతూ—

"ఇంతకీ—ఆయన నిస్సహాయ స్థితిలో వుండి నప్పుడు మీరు చూపిన ఉదారానికి ప్రతి ఫలంగా దాన విక్రయాది సర్వాధికారాలతో తమ యావదాస్తీ మీకు సమర్పించారు. కుదేలు డిచ్చినవి కుప్పె డటుకులే" అంటూ ఆమె చేతికి విల్లునకలు అందిస్తూ, "మీరే సీతారావమ్మగారని ఋజువు చేసుకుని, శాస్త్రి గారి విల్లు అమలు జరిపించడానికి మాకు తగిన సహాయం కల్పించండి—''

ఆమె కాగితాలు అందుకోనే లేదు. చాలా సేపు దిగాలుపడి అలాగ చూస్తూనే వుండిపోయింది. కొంత సేపటికి తెలివి తెచ్చుకుని లోపలికి వెళ్ళి, ఒక దస్తావేజు కాగితం తెచ్చి కరణానికందించింది—

"అది - వారు మరణించే దానికి పదిహేను రోజులకు ముందు నన్ను వివాహం చేసుకున్న సంగతిని ఋజువుచేసే డాక్యుమెంటు—''

కరణం చెవులూ కళ్లూ పనిచెయ్యడం మాని వేశాయి. ఆత్మమాత్రం రకరకాలుగా ఘోష పెట్ట సాగింది. అయ్యో ముసిలివాడా! 'ఆఖరి క్షణంలో చచ్చిపోతానని యెరిగివుండీ యెంత పని చేశావ్' అని వాపోతున్నాడు.

"నా దిక్కుమాలిన జీవితం అంతా విని....ఒక రోజుని 'నే చెప్పినట్టు చేస్తావా' అన్నారు. సరే అన్నాను....ఆ రోజొచ్చి తనని వివాహం చేసుకో మన్నారు—''

ఈ పెద్ద మనుష్యులలాగే ఆమె కూడా నిర్ఘాంత పోయి మాటలేక నిలబడిపోయింది. శాస్త్రి ఒకేఒక్క మాటతో ఆజ్ఞాపించాడు: "ఎదురు చెప్పకు—నీ తరఫునీ నా తరఫునీ అన్నీ ఆలోచించే ఈ పని చేస్తున్నాను...". ఆమె కిక్కురు మనలేదు. ఆ సాయంత్రమే బ్రహ్మసమాజ మందిరంలో ఇద్దరికీ వివాహం జరిగింది. ఆ మర్నాడు ఆమెను తీసుకుని వెళ్ళి సివిల్ లా ప్రకారం వివాహాన్ని రిజిస్ట్రారు వారివద్ద రిజిస్టరీ చేయించాడు.

అసలు భర్త చనిపోయిన సీతారావమ్మ నానా అవస్తలూ పడుతూ జీవిస్తూవచ్చింది. ఒక్కొక్క గాలిపాటుకు ఒక్కొక్క వూరు వెళ్లింది. దరిమిలాని పుట్టిన పిల్లవాడికి వంశగౌరవం ఇవ్వలేక, పతనమైన తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోలేక, ఈ జీవితానికే అలవాటుపడి ఈ వీధిలోనే నిలతొక్కుకుని నివసిస్తోంది ...ఈమెకి కులం గౌరవం ధనం ఇవ్వడానికే ముఖ్యంగా వివాహం చేసుకున్నాడా శాస్త్రి అని పిస్తోంది—

పాపం...మంచి పుట్టుకగల మనిషిలాగే కనపడుతుంది ఆమె. రూపసి. కాని, ఆమె అందం మోడు బారిపోయినట్లు అనిపిస్తుంది.

"మొదట్లో - కేవలం ఆయన నాకు కులం గౌరవం ఇస్తున్నారనుకున్నాను! ఏమైతే నేమి...ఆయన నాకు మాంగల్యం కట్టినవారు—నా భర్త!...కాని, ఆయన నాకు దక్కనే లేదు....''

"మేం పత్రికలో వేసిన ప్రకటన చూశారా?" కరణం బొంగురుపోయిన కంఠం ప్రశ్నించింది.

"చూశానండి..."

"ఈ విషయం మాకు తెలియజెయ్య లేదేవండి?"

"ఉదాత్తహృదయంతో ఆయన చేసిన పనిని నేను ఇంకో విధంగా ఎలా వుపయోగిస్తాను చెప్పండి. మీ వూరు వొచ్చి ఆయన ప్రతిష్ఠని కాస్తా గంగలో కలిపెయ్యనా? నానుంచి ఏ ప్రతిఫలం ఆశించకుండానే వివాహం చేసుకున్నారే నన్ను...ఆయనే లేనప్పుడు ఇతర విషయాలెందుకండి...''

"అర్థమయింది లెండి..." ఎంతో ఆవేదనతోనే అన్నాడు కరణం.

ఇంతలోకే ఒక ఆరేళ్ల కుర్రవాడొకడు పలక పుచ్చుకొని గెంతుకుంటూ వచ్చాడు. వీరిని చూసి కిక్కురు మనకుండా తల్లిదగ్గరికి వెళ్లి నిలుచున్నాడు.

కరణం తటాలున లేస్తూ అన్నాడు: ఆ పిల్లవాడిని ఉన్నతిలోకి తీసుకురండి. మా కుమంతులు అదే వుద్దేశ్యం అయివుంటుంది. శాస్త్రిగారికి.. మళ్లీ ఇంకో

సారి నేనో - గవర్నమెంటు తరఫున ఇంకెవరో మిమ్మల్ని కలుసుకుంటారు... సెలవు...'' అంటూ వీధిలోకి దారి తీశాడు.

వారందరి వెనక నే ఆమె అరుగుమీదికి వచ్చింది:

"ముందు ఈ యిల్లు మార్చెయ్యండి. ఇంతకీ సూరమ్మగారిని యేం చెయ్యమంటారు?''

"ఆయింటి నే కనిపెట్టుకుని వుండమనండి-''

"ఆ వెయ్యి రూపాయాలూ—"

"కర్మ చేసిన వారికివ్వండి-''

"లాభం లేదు. ఆయన పుచ్చుకోడు...''

"అయితే ఆలోచించి చెపతా...అంత వరకూ మీదగ్గిరే వుంచండి."

* * *

తర్వాత రెండు రోజులు కరణం ఒక దీర్ఘ సమాధిలో గడిపేశాడు. శాస్త్రినీ శాస్త్రిలిటి శవనునీ వైతరణి దాటించి వేసినా, శాస్త్రి మాత్రం కరణాన్ని వదిలి పెట్టేటట్లు లేదు. కళ్లు తెంచినా మూసినా శాస్త్రి అతనికి కనపడతాడు. దీనికి తోడు కరణం శరీరం ఈ పదిహేను రోజుల్లోనూ పదిహేను సంవత్సరాల వార్ధక్యం సంపాదించింది.

కరణంగిరీలు వారసత్వపు హక్కులను ఏనాడో కోల్పోయాయి. అంటే రూల్ ప్రకారం కాక పోయినా, వాస్తవానికి జరుగుతున్న ఫలితాలు అలాగే వుంటున్నాయి. శరీరంలోని రుగ్మత అంతకంతకు ఎక్కువయిపోయి కరణాన్ని వీధి అరుగు మీదకేనా రానీయు లేదు ఈ రెండురోజులూ.

పండగలకి వచ్చిన అల్లుడుమీదా కూతురుమీదా అతనికి వైరాగ్యం వచ్చింది. ఏదో మాట్లాడదామని వచ్చిన భార్యని నాలుగు పిచ్చికేకలు వేసి హాడల కొట్టేడు. అరుగుమీద కోతిగంతు లేస్తున్న మనవళ్ళని దగ్గరికి పిలిచి కసిదీరా వీపులు పగలకొట్టేడు.

ఈ రామరావణయుద్ధసంధి కాలంలో త్రిమూర్తులు లాగ దిగివచ్చారు - మునసబు, నారపరెడ్డి చంద్రాన్ని కూడా పెట్టుకుని. చంద్రం మళ్ళీ దూర ప్రయాణంలో తయారయ్యాడు. సిగరెట్టు వెలిగించాడు. కరణం చంద్రాన్ని ఎంతో మర్యాద చేశాడు:

"మీకు చెప్పకుండా వెళ్లిపోయినందుకు క్షమించండి. రామచంద్రపురంలో నేనే యింట్లో పుట్టానో ఆయింటిని ఒకసారి చూసిరావాలని బుద్ధిపుటి వెళ్ళి వచ్చాను. పనిలో పని కాకినాడ వీధులూ రాజమండ్రీ వీధులూ తిరిగి పూర్వస్మృతులు కొంత నెమరు వేసుకున్నాను..." అన్నాడు చంద్రం.

"మీరు నాకొక్క ఉపకారం చెయ్యాలి,'' అన్నాడు కరణం చంద్రం చేతులు పట్టుకుని దీనాతి దీనంగా చూస్తూ. "నా గుండెలలో బరువు తగ్గించండి. లేకపోతే నే అన్యాయంగా చచ్చిపోతానేమో—"

"నన్నేం చెయ్యమంటారు చెప్పండి—''

"వినండి—''

కరణం జరిగిన సంగతు లన్నీ పూస గుచ్చినట్లు చెప్పుకుపోయాడు.

చంద్రం కళ్లు చెమ్మగిల్లుతూనే వున్నాయి. అతిభారంగా శ్వాసవిడుస్తూ లేచి ఒక నమస్కారం పెట్టి అన్నాడు:

"ఇక నేను సెలవు తీసుకుంటా...మీరంతా చేసిన సహాయానికీ చూపిన వాత్సల్యానికీ కృతజ్ఞత ఏవిధంగా తెలియజేయాలో!...మా శాస్త్రి గారు ఆఖరి సమయంలో ఒక మహాత్కార్యం చేశారు. ఏ మామూలు మనిషీ చెయ్యలేని పని చేశారు...ఉదాహరణకి ఒక్క విషయం చెబుతాను—''

లేచి నిలబడిన ఆ ముగ్గురు వ్యక్తులూ తదేక దీక్షతో వింటున్నారు—

"ఒక స్త్రీని భర్త క్షమించ లేక పోయాడు. ఇంతకీ-ఆమె క్షమించమని కూడా ఎప్పుడూ అడగ లేదు...తల్లిదండ్రులు, అన్నదమ్ములు కూడా క్షమించ లేక పోయారు. బంధువులు పరిచయులు ఆ ప్రాణిని దరిదాపు రానీక దంపివేశారు...

''పతనమయిపోయిన ఒక వ్యక్తిని బాగు చెయ్యడానికి బెదిరింపులూ, నైతిక ఉపన్యాసాలూ, కాఠిన్యం డిసిప్లిన్లూ, పతివ్రతల కథలూ పని చెయ్యవు...శాస్త్రి గారు పూర్వం మాకు అతిసమీపంలో నే వుండేవారు. బాగా యెరుగుదును. నేపుట్టిన నాటినుంచీ ఆయన నన్నెరుగును. ఆ స్త్రీ విషయంలో ఆయన కూడా చాలా చాలా కలగజేసుకున్నారు...

ఎదురువచ్చిన మృత్యువు

"ఎవరా వ్యక్తి?" అనకుండా వుండలేక పోయాడు కరణం.

"చెబుతా...ఆప్యాయత చూపించడం వలనా, ఆదిక్కుమాలిన మనిషి నే ప్రేమించడం వలనా మార్పు వచ్చునని వాడు...ఆ సత్యసూత్రాన్ని ఇన్నాళ్ళకి ఈ స్త్రీ విషయంలో దృష్టాంతరంగా చూపించారు శాస్త్రి గారు..."

"ఈ స్త్రీని మీరెరుగుదురా?"

"బాగా యెరుగుదును. ఆ స్త్రీయే ఈవిడ!"

కరణం కొంచెం విస్తుపోయాడు. "తానిదివరకు శాస్త్రి గారినే యెరగనంటే!"

"పాతగోతులు తవ్వుకోడం వలన లాభం లేదు. ఆవిడ చెప్పిన పరిచయం కథ నిజమే అయివుండొచ్చు. ఘటన అంటే అలాగే వుంటుంది మరి—"

"పాపం...దరిమిలాని ఆ భర్త చనిపోయాడు లాగుంది—"

"ఆమెను వదిలేశాడు. చాలా కాలం విడాకుల కాగితం మీద ఆమె సంతకం పెట్టలేదు. ఎటువంటి పరిస్థితులలోనూ భార్యగా వుండే హక్కులను పోగొట్టుకోనన్నది.. స్వతస్సిద్ధంగా ఆమె చాలా తెలివైనది; బిగువుకున్నది—చివరికి బెదిరింపులవల్ల కూడా పని జరగలేదు...

"అల్లగా!...మీరు వెళ్ళిపోతున్నారా—"

"ఇప్పుడే.. వొచ్చిన పనేమో అయిపోయింది గదా—"

"శాస్త్రి గారు మీ కేమవుతారో...ఆవిణ్ణి మీ రెలాగ యెరుగుదురో... చెప్పేరే కాదు..."

వెళ్ళిపోడానికి రెండడుగులు వేసిన చంద్రం చిరునవ్వుతో ఆగిపోయాడు:

"ఈ రహస్యం దాపరికం యెందుకులెండి. మీ గుండెబరువు రెట్టింపవుతుందని భయపడి వూరుకున్నాను...ఆమె మొదటి భర్తను నేనే! ఎక్కడికో పారిపోయి, ఈ జనాన్నీ బంధువులనీ చూడలేక, ఆమెకి వైధవ్యం ఇచ్చాను... నే చచ్చిపోయినట్లు వార్త పుట్టించింది... పేరుమార్చుకుని బతుకుతున్నాను...ప్రభల విశ్వనాథశాస్త్రి గారు నా స్వంత అన్నగారు.... సరేనా? "

కరణంమీద పెద్ద పిడుగుపడినట్లయింది. అతనికి తెలివి వచ్చేసరికి సావిడిఅంతా ఖాళీగావుంది. వణుకుతున్న చేతులతో డెస్కు పెట్టె దగ్గరకూర్చుని తన ఉద్యోగానికి రాజీనామా పత్రం తయారు చేశాడు. అది - విశ్వనాథశాస్త్రి వ్యవహారాల మీద తాను రచించిన రిపోర్టుతో జతచేసి జిల్లా కలెక్టరు గారికి పంపుకున్నాడు.